క్లుప్తంగా

'ఆరోపణలు అవాస్తవం'

కాసిపేట(బెల్లంపల్లి): తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని బెల్లంపల్లి బుగ్గ దేవాలయం పూజారి రాంభట్ల వేణుగోపాల శాస్త్రి ఖండించారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడారు. ముప్పై సంవత్సరాలుగా పనిచేస్తున్న తనపై, ఏ తప్పు చేయకున్నా కొందరు కావాలని ఉద్యోగానికి ఇబ్బందులు కలిగించాలని నిందలు వేస్తున్నట్లు తెలిపారు. తప్పుడు ఆరోపణలతో తీవ్ర మనస్థాపానికి గురైనట్లు తెలిపారు. ఆలయంలో పనిచేసే స్వీపర్ పోచమ్మ సైతం పూజారిపై వచ్చిన ఆరోపణలు ఖండించారు.

'ఎన్నికలకు ప్రాథమిక పిల్లర్ బీఎల్‌వోలు'


శిక్షణ పొందిన బీఎల్‌వోలతో తహసీల్దార్

జన్నారం: ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రాథమిక పిల్లర్ బూత్‌లెవల్ అధికారులు అని అసెంబ్లీ స్థాయి ట్రైనర్ లక్ష్మణ్, తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం బూత్‌లెవల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఆర్టికల్ 324, 325, 326ప్రకారం ఎన్నికల సంఘం ఏర్పాటు చేసి, ఎన్నికలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో డీటీ రామ్మోహన్, ఆర్‌ఐలు భాను చందర్, గంగ తదితరులు ఉన్నారు.

మైసమ్మ ఆలయ ముఖద్వారం ఏర్పాటు


ముఖ ద్వారం వద్ద స్థానికులు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ ఆలయ సమీపంలో శనివారం ఆలయ ముఖ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. సింగరేణి సహకారంతో ముఖద్వారం ఏర్పాటు చేయగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం నాయకులు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

కాసిపేట సీఐగా హన్నాక్


ఎమ్మెల్యేను కలిసిన సీఐ హన్నాక్

కాసిపేట(బెల్లంపల్లి): బెల్లంపల్లిరూరల్ సీఐగా చెందవోలు హన్నాక్ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీఐ అఫ్జలుద్దీన్ బదిలీ కాగా, ఆయన స్థానంలో ఖమ్మం సీఎస్‌బీలో పనిచేస్తున్న హన్నాక్ బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకి పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వినోద్‌ను సీఐ మర్యాద పూర్వకంగా కలిశారు.

ప్లాట్ ఫాం నిర్మించరూ..!



చెన్నూర్‌రూరల్: మండలంలోని రాయిపేట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న చేతిపంపు చుట్టూ ఎలాంటి ప్లాట్ ఫాం నిర్మించలేదు. దీంతో నీరంతా చేతిపంపు చుట్టూ చేరి అధ్వాన్నంగా మారుతోంది. నీరు చేతిపంపు చుట్టూ నిలవడంతో దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని, సంబంధిత అధికారులు పట్టించుకొని ప్లాట్ ఫాం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మంచిర్యాల ఆస్పత్రికి మంచిరోజులెప్పుడో..

- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యుల కొరత
- శిథిలావస్థలో ఆస్పత్రి భవనం..
- టీహబ్‌లో ఖాళీలతో పూర్తిస్థాయిలో అందని సేవలు
- నేడు జిల్లాకు డిప్యూటీ సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాక



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

మంచిర్యాలటౌన్: కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు కేంద్ర బిందువైన మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఏళ్లుగా సమస్యలతో సతమతమవుతోంది. దశాబ్దాల నాటి ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరింది. నూతన భవన నిర్మాణంలో నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఇక వైద్యులు, సిబ్బంది కొరతతో రోగులకు సరైన సేవలు అందడం లేదు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఆస్పత్రి సమస్యలపై చర్చించి పరిష్కారాలు చూపాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

శిథిల ఆస్పత్రి..
మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి రోజూ వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. పాత భవనం శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. వార్డుల్లోకి వరద చేరే ప్రమాదం ఉంది. 450 పడకలతో నిర్మిస్తున్న కొత్త భవన నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. ఈ వర్షాకాలం లోనూ పాత భవనంలోనే సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. నిర్మాణం పూర్తికి మరో నాలుగు నెలలకుపైగా సమయం పట్టే అవకాశం ఉంది.

సిబ్బంది కొరత..
జిల్లా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. అత్యవసర విభాగంలో 10 మంది వైద్యులకు ఏడుగురే ఉన్నారు. డెంటిస్టు, కంటి వైద్యులు లేక సేవలు అందడం లేదు. కార్డియాలజిస్టు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఆ సేవలు అందుబాటులో లేవు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 14 గైనకాలజిస్టు పోస్టులకు ఆరుగురే ఉన్నారు. నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, ఐదుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

టీహబ్‌లోనూ కొరతే..
జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు టీహబ్ ద్వారా 134 రకాల ఆరోగ్య పరీక్షలు చేయాల్సి ఉంది. సిబ్బంది కొరతతో ప్రస్తుతం 82 రకాల పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నారు. రేడియాలజిస్టు, బయోకెమిస్టు పోస్టులు టీహబ్ ప్రారంభమైనప్పటి నుంచి ఖాళీగా ఉన్నాయి. అదనంగా, ఒక ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు భర్తీ చేయాల్సి ఉంది. ఈ లోటుపాట్ల వల్ల రోగులకు సమగ్ర వైద్య సేవలు అందడం లేదు.

మంత్రుల పర్యటనపై ఆశలు..
రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదివారం జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి సమస్యలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. నూతన ఆస్పత్రి భవనం నిర్మాణ పనులు వేగవంతం చేయడం, ఖాళీగా ఉన్న వైద్య, సిబ్బంది పోస్టులు భర్తీ చేయడం, టీహబ్‌లో అన్ని రకాల పరీక్షలు అందుబాటులోకి తేవడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలంలో పాత భవనంలో తలెత్తే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, రోగులు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీకి సన్మానం


అనిల్‌కుమార్ యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కాసిపేట,(బెల్లంపలి): కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ శనివారం మొట్టమొదటి సారిగా బెల్లంపల్లి నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, మాజీ జెడ్పీటీసీ కారుకూరి రాంచందర్, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ మాధవరపు నర్సింగరావు, వేమనపల్లి మాజీ జెడ్పీటీసీ రుద్రభట్ల సంతోష్, భీమిని మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కన్నెపల్లి మండలాధ్యక్షుడు పప్పుల రామాంజనేయ, తాండూర్ మండలాధ్యక్షుడు ఎండీ ఈసా, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఏల్పుల రోహిత్ తదితరులున్నారు.

చట్టవ్యతిరేకులను ఉపేక్షించం

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్


మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్

జైపూర్: చట్ట విరుద్ధంగా ఎవరు పనిచేసినా.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. జైపూర్ మండలం ఇందారం గ్రామంలో శనివారం కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సైలు శ్రీధర్, సంతోష్‌తో కలిసి గ్రామంలో తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 70 బైక్‌లు, 5 ఆటోలు గుర్తించి యజమానులకు జరిమానా విధించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్థానిక సమస్యలను ప్రజలు ఏసీపీ దృష్టికి తీసుకురాగా, సమస్య విషయంలో స్థానిక పోలీసులు ఎలా స్పందిస్తున్నారని అడిగారు. భద్రతా పరమైన విషయాలపై పోలీసుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్స్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించి వారి ప్రస్తుత పరిస్థితి, జీవన విధానం అడిగి తెలుసుకున్నారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరాపై నిఘా నియంత్రణలో భాగంగా ఇందారంలో అనుమానాస్పద ప్రాంతాలు, ఇళ్లను నార్కోటిక్ డాగ్‌తో తనిఖీ చేశామన్నారు. గ్రామంలోకి ఏవరైనా కొత్త వ్యక్తు వచ్చిన వారి వివరాలు పోలీసులకు అందించాలని తెలిపారు.

పోడు భూములపై పెత్తనం ఆపాలి


నిరసన తెలుపుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

నెన్నెల: గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములపై ఇప్పటికీ అటవీ శాఖ అధికారులు పెత్తనం చెలాయిస్తున్నారని, సాగును అడ్డుకుంటే ఊరుకునేది లేదని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి హెచ్చరించారు. మండలంలోని జంగాల్‌పేట పంచాయతీ పరిధి కొత్తగూడం శివారు భూముల్లో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. అటవీ శాఖ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ దశాబ్దాలుగా గిరిజనులు ఈ భూములను సాగు చేసుకుంటున్నారన్నారు. కొందరికి 1–70 చట్ట ప్రకారం పట్టాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఆ భూములను దున్నితే కేసులు పెడతామని అటవీ శాఖ అధికారులు బెదిరిస్తున్నారన్నారు. అటవీ భూముల్లో సాగులో ఉన్న వారికి హక్కు పత్రాలు ఇస్తామని కాంగ్రెస్ నాయకులు ఓట్లు దండుకున్నారని, గద్దెనెక్కిన తర్వాత మాట మారుస్తున్నారని ఆరోపించారు. ఆదివాసుల హక్కులను కాలరాసే జీవో 49 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు భూములు దక్కే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. ఆందోళనలో మాజీ ఉపసర్పంచ్ చిలుకయ్య, నాయకులు మధునయ్య, నాగేష్, వెంకటేశ్, సాగర్, దిలీప్, కమల తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న ఎఫ్‌డీవో రామ్మోహన్

జన్నారం: విద్యార్థులు చదువుకునే వయస్సు నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, ఈ దిశగా పాఠశాల యాజమాన్యం ప్రోత్సహించడం అభినందనీయమని ఎఫ్‌డీవో రామ్మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్, 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇన్వెస్టిచర్ వేడుక శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి కౌన్సిల్ సభ్యులు, మంత్రివర్గ సభ్యులు, హౌస్ కెప్టెన్లు, కో ఆర్డినేటర్లను నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన ఎఫ్‌డీవో మాట్లాడుతూ.. తెలుగు భాషపై గౌరవం పెంచుకోవాలని, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జన్నారం ఎస్సై గొల్లపెల్లి అనూషా, స్లేట్ గ్రూప్ ఫౌండర్ సుభాష్ రెడ్డి, చైర్మన్ డా.శ్రీకాంత్ రెడ్డి, స్లేట్ హై స్కూల్ ప్రిన్సిపాల్ షిరిన్ ఖాన్, స్లేట్ ఎక్సలెన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్యామ్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

మహిళల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీబీజీకేఎస్ నాయకులు కోరారు. ఆ యూనియన్ ఫిట్ సెక్రెటరీ గడ్డం సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం నాయకులు గని మేనేజర్ ఐ.శ్రీనివాసును కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రావు, నిఖిల్, జంగా రమేశ్, సారయ్య, బుర్ర శ్రీనివాస్, ప్రవంతి, హేమలత పాల్గొన్నారు.

ఫిట్ సెక్రెటరీ నియామకం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ 1గని ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రెటరీగా పారుపల్లి శ్రీధర్‌ను నియమించారు. ఈ మేరకు ఆ యూనియన్ సెక్రెటరీ జనరల్ బీ. జనక్‌ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. నస్పూర్ కాలనీలోని యూనియన్ కార్యాలయం వద్ద శనివారం యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు చేతుల మీదుగా నియామకపత్రం అందించారు. ఇప్పటివరకు పలు గనుల్లో ఫిట్ సెక్రెటరీలుగా పనిచేసిన మద్దెల వెంకటేశ్, శ్రీకాంత్‌లను ఏరియా కార్యదర్శులుగా నియమిస్తూ నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

క్యాంటీన్ సమస్య పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో క్యాంటీన్ సమస్యలు పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు ఎస్కే బాజీసైదా ఆధ్వర్యంలో నాయకులు గని మేనేజర్ ఐ శ్రీనివాస్‌ను కలిసి శనివారం వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచీ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, ఫిట్ సెక్రెటరీ నల్లపు సత్తయ్య, ట్రేడ్స్‌మెన్ కమిటీ సభ్యులు నాగభూషణం పాల్గొన్నారు.

ఎంజేపీలో స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు


ఓటు హక్కు వినియోగించుకున్న విద్యార్థులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట మహాత్మ జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో శనివారం స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. స్కూల్ పీపుల్ లీడర్ (ఎస్‌పీఎల్), డెప్యూటీ స్కూల్ పీపుల్‌లీడర్(డీఎస్‌పీఎల్), స్పోర్ట్స్ లీడర్(ఎస్‌ఎల్‌లను ఎన్నుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఆర్‌సీఓ సేరు శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించగా విద్యార్థులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు పారదర్శకంగా ఎలా నిర్వహిస్తారో ఈ ఎన్నికల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు.

హామీలు అమలు చేయాలి

పాతమంచిర్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన జీవో 282 గురించి పునరాలోచించాలని, కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 8గంటల పనివిధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం 10గంటలకు పెంచిందని, ఇది సరైంది కాదన్నారు. కార్మికులు, ఉద్యోగులకు కనీస వేతనం చెల్లిస్తామని అనేక హామీలిచ్చి నేటికీ నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దూలం శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

సమాచారం

వారసంత బంద్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే వారసంతను బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి భవనం ప్రారంభించేందుకు మంత్రులు హాజరవుతున్న నేపథ్యంలో రహదారి సౌకర్యం, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఒక్కరోజు సంతను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు వ్యాపారస్తులు సహకరించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూర్ సబ్‌స్టేషన్‌లోని 33కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8గంటల నుంచి ఉదయం 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ కేశెట్టి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పొక్కూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో చెట్ల కొమ్మల తొలగింపు, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల వల్ల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సంక్షిప్త వార్తలు

- **ఆర్థిక సాయం అందజేత**

దండేపల్లి: మండలంలోని ద్వారక గ్రామానికి చెందిన కట్కూరి లక్ష్మి ఇటీవల మరణించింది. కాగా ఆ కుటుంబానికి రాయల్ వినాయక గ్రూప్ యూత్ రూ.10వేల 516, మాజీ ఎంపీటీసీ ఇప్ప సురేందర్ రూ.5వేలు, 25కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు సాయినీ ప్రవీణ్, సూరినేని శంకర్, విజయ్, గ్రామస్తులు అశోక్, ప్రతాప్, చెరుకు శ్రీనివాస్, పాల్గొన్నారు.

- **'దళారులను నమ్మొద్దు'**

తాండూర్: మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న డే వాచ్ ఉమెన్, అసిస్టెంట్ కుక్, స్కావెంజర్, స్వీపర్ పోస్టుల భర్తీ విషయంలో అభ్యర్థులు దళారులను నమ్మొద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్యాజి మహేందర్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎలాంటి అవకతవకలకు తావు లేదని శనివారం ఆయన విలేకరుల సమావేశంలో తెలిపారు. మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు.

- **బదిలీలు సహజం**

జన్నారం: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని హెచ్‌ఎం మురళీధర్ అన్నారు. మండలంలోని తపాలపూర్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయినిగా పనిచేసి, బదిలీపై వెళ్లిన ఇ.వజ్రమాలను శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, చంద్రిక, రాజేందర్, గోపాల్, రామారావు, శ్రీనివాస్, సాయన్న, శరీష్మా పాల్గొన్నారు.

- **నిజాయతీ చాటుకున్న ఆటో డ్రైవర్**

చెన్నూర్: కాగజ్‌నగర్‌కు చెందిన స్వప్న–శ్రీనివాస్ దంపతులు చెన్నూర్ పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్న కుమారున్ని చూసేందుకు శనివారం చెన్నూర్‌కు వచ్చారు. చెన్నూర్ బస్టాండ్ నుంచి గురుకుల పాఠశాలకు ఆటోలో వెళ్లే క్రమంలో ఆటోలో ఫోన్ మరిచిపోయింది. చెన్నూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ విచారణ జరిపారు. సీఐ ఆటో డ్రైవర్ శ్రీనివాస్‌కు ఫోన్ చేయగా నా ఆటోలో ఫోన్ లభించిందని నిజాయతీగా సెల్ ఫోన్‌ను సీఐ దేవేందర్‌రావుకు తీసుకొచ్చి ఇచ్చారు. సీఐ బాధితులకు ఫోన్‌ను అప్పగించారు.

- **రోడ్డు నిర్మాణానికి ఆర్థికసాయం**

చెన్నూర్‌రూరల్: మండలంలోని నాగాపూర్ గోదావరి ఒడ్డు నుంచి గ్రామానికి వచ్చే రహదారి చెడిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు బీజేపీ చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్ దృష్టికి తీసుకెళ్లగా శనివారం రోడ్డును సందర్శించారు. తనసొంత డబ్బులను గ్రామస్తులకు ఇచ్చి మట్టి రోడ్డు నిర్మాణానికి కృషి చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, నాయకులు అన్నల మల్లేశ్, సత్యం, శ్రీను, రాజన్న, రాజబాపు పాల్గొన్నారు.

- **పేరెంట్స్ కమిటీ నియామకం**

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల పేరెంట్స్ కమిటీని నియమించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమాకళ్యాణి శనివారం తెలిపారు. అధ్యక్షుడిగా సీహెచ్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎ.సరిత, కార్యదర్శిగా ఎల్.తిరుపతి, అసిస్టెంట్ కార్యదర్శి ఎ.మురళి, జాయింట్ కార్యదర్శి ఆర్.సత్యం, కోశాధికారిగా ఒ.సత్యనారాయణ, సలహాదారులుగా లింగయ్య, తిరుపతి, పోచమల్లు, చంద్రయ్య, గీత, జ్ఞానేశ్వరి, అఖిల, రాజమణి, కళ్యాణి, నరేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

- **సీఈఆర్ క్లబ్‌లో వైద్య శిబిరం**

మందమర్రిరూరల్: పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో శనివారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి రేపాక రమేశ్ రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు.

- **'42శాతం రిజర్వేషన్ అభినందనీయం'**

మందమర్రిరూరల్: స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడంపై పట్టణ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, సంఘం పట్టణ అధ్యక్షుడు సకినాల శంకర్, ప్రధాన కార్యదర్శి బత్తుల సతీష్‌బాబు తదితరులు ఉన్నారు.

- **మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**

కాసిపేట: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కాసిపేట ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం చౌరస్తాలో శనివారం గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అంజనీపుత్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆటో యూనియన్ జేఏసీ అధ్యక్షుడు రామ్ కుమార్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

- **పోస్టర్ ఆవిష్కరణ**

మంచిర్యాలక్రైం: గాయిత్రిక ప్రొడక్షన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న 'స్నేహం కోసం' యూట్యూబ్ ఫిలీం పోస్టర్లను స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, హీరో పోగుల రమేశ్, నటులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. పొంచి ఉన్న ప్రమాదం



భీమారం: మండలంలోని పోలంపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం వల్ల వాహనాలు ఏమాత్రం ఏమరపాటుగా నడిపినా రోడ్డు దిగి ట్రాన్స్‌ఫార్మర్‌కి తాకే ప్రమాదం ఉంది. రోడ్డుకి అతి సమీపంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయొద్దని చెప్పినా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. కాగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కి చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేయలేదని వారు తెలిపారు.

సంబంధిత అధికారి : శంకర్, విద్యుత్ శాఖ ఏఈ, భీమారం
ఫోన్ నంబర్ : 79818 34896

నిరంతర నిఘా ఉండాలి


చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న ఎఫ్‌డీవో

జన్నారం: చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది నిరంతరంగా నిఘా పెట్టాలని ఎఫ్‌డీవో రామ్మోహన్ అన్నారు. జన్నారం అటవీ డివిజన్‌లోని ఇందన్‌పల్లి చెక్‌పోస్టును శనివారం తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. పర్యావరణ శిస్తుకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కలప స్మగ్లింగ్ జరుగకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట రేంజ్ అధికారి శ్రీధరచారి, టాస్క్‌ఫోర్స్ రేంజ్ అధికారి కారం శ్రీనివాస్, సెక్షన్ అధికారి రవి, సిబ్బంది ఉన్నారు.